# ఏముంది నాకు?

నా వయస్సప్పుడు ఇరవై ఏళ్లు. చిన్నక్కయ్యకు మొదటి సంతానం, కూతురు పుట్టిందంటే నెంతో సంతోషం కలిగింది. ఎందుకో మొదణ్ణుంచి నాకు ఆడవాళ్లంటే ఉన్నంత వాత్సల్యం మగవాళ్లంటే లేదు. అందుక్కారణం నలుగురు అక్కలకు నేనొక్కణ్ణే తమ్ముణ్ణి కావటం కావచ్చు.

ఆఫీసుకు సెలవయినా పెట్టకుండా వెళ్లిపోయి, చిన్నారి పాపాయిని చూచి తిరిగివచ్చి ఆఫీసులో చివాట్లు తిన్నాను.

ఆరో నెలలో రాణి ఎలావుందో చూడాలనిపించి వెళ్లాను. ఎర్రప్పుశరీరం, గుండ్రని కళ్లు, పాల బుగ్గలు, లేత పెదవులు, బొద్దు శరీరం, ఎంతో అందంగా ఆరోగ్యంగా వుంది రాణి.

పాలిచ్చి, తలస్నానం చేయించి, సాంబ్రాణి పొగవేసి రాణిని ఉయ్యాలలో పడుకోబెట్టింది అక్క. కాళ్లూ చేతులు ముఖందగ్గర పెట్టుకొని బుంగమూతి తెరిచి, చొంగ కార్చుతూ ఆడుకొంటూ వుంది రాణి.

నేను ఉయ్యాల వూపుతూ కూర్చున్నాను. పాప బొ... ఆడుకొంటూ వుంది. నాకు చెల్లెళ్లు లేరు. అందరూ అక్కలే. రాణిమీద ఎందుకో చాలా ఇష్టం! ఉయ్యాలలోంచి తీసుకొని భుజంమీద వేసుకొన్నాను.

నా చొక్కా చల్లగావుంటే చూశాను. రాణి బట్టలు తడిపింది. పడుకోబెట్టి ఊపుతూ కోపంగా చూస్తే నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి. ళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరవకుండా సుతారంగా వ్వింది రాణి.

* * * *

నా కప్పుడు ఇరవై అయిదేళ్లు. రాణికి అయిదేళ్లు! పుట్టిం రోజు పండుక్కు అక్క వ్రాస్తే వెళ్లాను.

బర్త్‌డే ప్రెజెంటేషన్లు చాలా తీసుకుపోయాను. బొమ్మల పుస్తకాలు, గౌన్లు, స్వీట్ల టిన్లు చాలా!

అన్నీ అక్కకిచ్చాను.

'నా కెందుకురా! దానికివ్వు' అంది. రాణి అన్నీ తీసు ంది. ఆ రోజు నేను తీసుకుపోయిన గౌనే వేసింది అక్క!

అయిదేళ్లకే బాగా పెరిగింది.

బొద్దుగా వుంది. ఎన్నో మాటలు, మాటలపుట్ట. నర్సరీ ాంగ్స్ చాలావచ్చు. ఎప్పుడూ ఎగురుతూ వుంటుంది. ంగ్లీషూ తెలుగూ చాలా పాటలు ఏక్షన్‌తో నేర్చుకొంది. ాన్వెంట్‌లో ప్రీ బేసిక్ క్లాసు!

ఫేక్టరీ అయినా ఆగుతుంది రాణి నోరు ఆటడం ఆగదు. ాగుడు తప్పితే ఎగురుడు, కాదంటే నోరు! నోట్లో ఏం సుకొన్నా మర ఆడించినట్టే! మరు క్షణం నోరు కాళీ అయి ోయింది.

సాయంకాలం హాలులో అందరం కూర్చున్నప్పుడు అక్క ాణితో అంది.

'మామను చేసుకొంటావుటే బాగా చూచుకొంటాడు.'

బిత్తరపోయి దిక్కు తెలియకుండా చూస్తూ అంది.

'ఈ మామనా?'

'అవును. ఏం?' అక్క.

'నాకొద్దు పాడు!' అంటూ నా జుత్తు ఎడాపెడా చెరివేసి ఎగురుతూ రాణి వెళ్లిపోబోతుంటే చేయి పట్టుకొన్నాడు.

కోపంగా ముఖంలోకి చూస్తే నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి. కళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరవకుండా సుతారంగా నవ్వింది.

*    *    *    *

రాణి కప్పుడు తొమ్మిదో ఏడు!

హైస్కూలులో చేర్పిస్తున్నాం. రమ్మని వ్రాస్తే వెళ్లాను. తొమ్మిది ఏళ్లలో అక్కయ్యకు మళ్లీ పిల్లలు కలగలేదు.

రాణి గారాలకూతురు. ఆ రోజు ఇల్లంతా చాలా సందడిగా వుంది.

'బావయ్యకు సెలవు దొరకలేదు. దాన్ని నువే స్కూలులో చేర్చి రారా!' అంది, అక్క.

రాణిని స్కూలుకు తీసుకుపోయాను. ఎడ్మిట్ చేయించాను. మధ్యాహ్నం ఇంటికి వచ్చాను రాణితో. రాణి అందంగా ఆరోగ్యంగా ఆనందంగా వుంది.

అన్నం ముందు కూర్చున్నాను.

అక్క అడిగింది.

'పెళ్లి చేసుకోవేమిరా?'

నే నేమీ మాట్లాడలేదు.

'మాట్లాడవేమిరా?'

'నువ్వే చెయ్యి' అన్నాను నవ్వుతూ.

'అమ్మా నాన్నలు తెచ్చిన సంబంధాలు చేసుకొన్నావూ క నేను చెయ్యాలి నీకు' అంటూ నేయ్యి వడ్డించింది.

మరేమీ సంభాషణ సాగలేదు.

సాయంకాలం నోట్ బుక్స్, టెక్స్టుబుక్స్ పెన్ను కొని తెచ్చాను. రాణి చూస్తూవుంది. అక్క కిచ్చాను.

రాణికి అక్క పెన్ను ఇస్తూ 'మామయ్య ఇచ్చాడే' అంది.

అటూ ఇటూ చూచి, 'చీ ఏం బాగాలేదు' అంది రాణి.

'రాణీ! నిజంగా బాగాలేదా నీకు' అని చేయి పట్టుకొని ాపంగా చూస్తూ అడిగితే నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కను రెప్పలు కదిలాయి. ళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరవకుండా సుతారంగా వ్వింది.

*   *   *   *

రాణి కప్పుడు పదమూడేళ్లు. స్కూల్లో ఫోర్తు ఫారం దువుతూ వుంది.

రాణి రజస్వల అయిందని అక్క దగ్గర్నుంచి ఉత్తరం చ్చింది. అమ్మ నాన్నా ఉత్తరంలో ఏమేమి కావాలో వ్రాసి న్ని నన్నే తీసుకురమ్మని, అమ్మాయిదగ్గరే కలుసుకొందామని ్రాశారు.

నాకు ఎంతో సంతోషమయింది.

అన్నీ తీసుకొని బయలుదేరాను.

బంధువులతో అమ్మలక్కలతో ఇల్లంతా కళకళలాడుతూ కనులపండుగలాగా వుంది.

ఆ రోజంతా హడావుడిగా ఆపనీ ఈపనీ జరుగుతూవుంది

సాయంకాలం హాలులో అందరం కూర్చుని వున్నాము సంభాషణ అనుకోకుండా నావైపు మళ్లింది.

'వాడికి నీ కూతురు అయినా నచ్చుతుందేమో అడగవే అంది అమ్మ.

'అంతకంటే నాకేంకావాలి. వాడికిష్టమైతే' అంది అక్క

'ఏమిరా?' అంది అమ్మ.

నవ్వాను. ఎంతో తీపిగా నవ్వివుంటాను. 'రాణి పసిపిల్ల అన్నాను. లేచి తోటలోకి వచ్చాను.

నేను తెచ్చిన చీరె కట్టుకొని, తోటలోకి వచ్చి పూల కోస్తూవుంది రాణి. పూసిన పందిరిలాగా వుంది.

నన్ను చూచి ఆరిందాలాగా 'ఇక్కడున్నావా మామయ్యా నన్ను నీకిచ్చి పెళ్లి చేస్తారటగా' అంది.

నవ్వాను.

నా పసానిలా ముంజెంగులు ముంగాళ్ల మీద జీరాడుతు వుంటే చీరె సరిచేసుకొంటూ దగ్గరకు వచ్చింది.

'ఏం?' అన్నాను.

'చీరె ఏం బాగాలేదు మామయ్యా' అంటూ నవ్వింది జడ చేతికి తగిలింది. పట్టుకొన్నాను.

'నిజమే!' చిరుకోపంగా అడిగితే, జడ విడిపించుకొంటు నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి. కళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరవకుండా సుతారంగా నవ్వింది రాణి.

* * * *

రాణికప్పుడు పదహారేళ్లు. స్కూల్ ఫైనల్ పరీక్ష వ్రాసింది. అక్కదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

సారాంశం కూతురుకు పెళ్లి సంబంధం చూడమని.

నావల్ల ఏమవుతుంది? నా పెళ్లి చేసుకోలేని నేను రాణి పెళ్లిసంబంధం ఎలా చూడగలనూ?

నా అసమర్థతపట్ల నాకే అసహ్యం వేసింది. జవాబు వ్రాయకుండా వూరుకొన్నాను.

నెలరోజులకు మళ్లీ ఉత్తరం వచ్చింది. పిల్లను చూడటానికి ఎవరో వస్తున్నారు రమ్మని.

నేను పోయి ఏం చేయగలనూ? ఏమీ చేయలేను! పోకుండా ఉండటం ఎలా? వెళ్లాలి? అక్క రమ్మని వ్రాసింది కాబట్టి వెళ్లాను.

వాళ్లు వచ్చారు. రాణిని చూచుకొన్నారు. నచ్చిందని చెప్పారు. తాంబూలాలు పుచ్చుకొన్నారు.

పుత్రుడు ఇంజనీరు. ఒక్కడే కొడుకు. చాలా ఆస్తిపరులు.

అక్క బావదగ్గరకు పోతూ తీసుకుపోయింది ఏమీ లేకపోయినా, మేము ఏమీ ఇవ్వలేకపోయినా, రాణికి కట్నం చాలా ఇవ్వాలని ఇవ్వగల బావ నిర్ణయించుకొన్నాడు. నిజ మాలోచిస్తే ఆస్తి అంతా రాణిదే!

ఆ సాయంకాలమే బయలుదేరాను. ఆఫీసులో ఫైళ్లు పెరిగిపోతాయనే చింతతో!

ఆరోజంతా రాణి కనిపించలేదు. రాణి ఎక్కడుంది అని అడగటానికి ఎందుకో బాధ కలిగింది.

గేటు దగ్గరకు వచ్చి వెనక్కు చూస్తే కిటికీలోంచి రాణి కనిపించింది.

కళ్లలో నీటి బిందువులు నిలిచి వున్నాయనిపించింది. ఆనంద బాష్పాలో! విషాద బిందువులో!!

ఒక్క అడుగు వెనక్కు వేశాను. చూస్తుంటే ఆమె నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి. కళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరువకుండా సుతారంగా నవ్వింది రాణి.

* * * *

రెండువారాల్లో పెళ్లికార్డు వచ్చింది. అంతకు వారంముందే ప్రమోషన్ రావటంవల్ల పనిభారంవల్ల రాణి పెళ్లికి వెళ్లలేక పోయాను.

పెళ్లయింతర్వాత రాణికి స్వేచ్ఛ వచ్చిందో ఏమో ఉత్తరం వ్రాసింది.

అందులో సంగతి ఏమీలేదు. ఫలానా తారీఖు ఫలానా రైలులో మీవూరు మీదుగా అత్తవారింటికి వెళుతున్నాను భర్తతో అని మాత్రమే వుంది.

స్టేషన్ దగ్గరకు పోయాను. రైలు వచ్చింది. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో కనిపించింది రాణి. రైలెక్కాను.

భర్తను పరిచయం చేసింది.

చక్కగా వున్నాడు. ఆరోగ్యంగా వున్నాడు. అంతకంటే అన్ని అందాలా రాణి బాగుంది.

ఏమేమో మాట్లాడింది.

మాటల్లో పెళ్లికి రాలేదేమని అడిగింది.

'కార్య భారంవల్ల,' అని చెప్పాను.

నమ్మనట్లు చూచింది.

గార్డు విజిల్ వూదాడు. ఇంజన్ కూత వేసింది. కంపార్టు మెంటులోంచి దిగాను.

'నేను నమ్మను'

'నిజంగా నమ్మవా?'

రైలు కదిలింది.

'ఊహు!' తల అడ్డంగా వూపింది. కోపంగా చూశాను. నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి. కళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరువకుండా సుతారంగా నవ్వింది రాణి.

* * * *

రెండేళ్లు తిరక్కముందే—రాణి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. రాణికి ఆడపిల్ల.

ఎంతో సంతోషంతో వెళ్లాను.

పాపాయి ఎంతో ముచ్చటగావుంది. ఎంత సేపు చూచినా తనివి తీరటంలేదు.

అంత అందాలరాసి నే నెప్పుడూ చూడలేదు.

'పాపాయిది అంతా తాత పోలికే' అంటుంటే ఎందుకో అమితంగా సిగ్గు కలిగింది. అందరూ అదే మాట నాకు ప్రాణం పోయినంత పనయింది. ఎంత ఆనందమో!

పసిగందుకు పాలిచ్చి, వచ్చి అన్నం వడ్డిస్తున్న రాణిని చూస్తుంటే అక్కయ్య గుర్తుకు వచ్చింది.

'పాప మీ పోలికేనట!'

'అవును అందరూ అంటున్నారు'

ఆ రోజు ఎంత అన్నం తిన్నానో నేను చెప్పలేను. కొన్ని వందల ఏళ్లనుంచి, అతిశయోక్తి కావచ్చుగాక. అన్నం ముఖం ఎరుగని మనిషిలాగా అన్నం తిన్నాను.

'మీ రెందుకు పెళ్లి చేసుకోరు!' అడిగింది రాణి తమల పాకు చుట్టి ఇస్తూ.

'నేనా?' నవ్వి వూరుకొన్నాను.

పాపకేవో కానుకను కొనియిచ్చి బయలుదేరుతున్న సాయంకాలం 'మనమరాలు ఎలావుంది?' అని అడిగింది.

'బాగుంది'

'పెళ్లాడకూడదూ!'

కోపంగా చూస్తే నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి కళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరవకుండా సుతారంగ నవ్వింది రాణి.

* * * *

నాకు అరవై ఏళ్లు. పెళ్లికి నాకూ చుక్కెదురు అయింది. రాణికి ఇద్దరు ఆడపిల్లలు ఇద్దరు మగపిల్లలు. పెద్దకూతురు యం. బి బి. యస్. పూర్తి చేసింది. పెద్దకొడుకు ఇంజనీరు అయ్యాడు. చిన్నకొడుకు బి. ఏ. చదువుతున్నాడు. రాణి దగ్గర్నుంచి ఆ రోజు వచ్చిన ఉత్తరంలో అత్యవసరమైన పని వుంది, వెంటనే రమ్మని వ్రాసింది.

రిటైరు అయి నెలకు రెండువందల ఏభై పెన్షన్ పుచ్చుకొంటూ స్వంత యింట్లోంచి ఎక్కడికి పోకుండా జీవితంలో చరమాధ్యాయం ఒంటరిగా చదువుకొంటున్న నాకు స్థలం మార్పు అంటే భయం కలిగింది.

అయినా వెళ్లాను.

భర్త అలిగి, ఆఫీసుకు సెలవుపెట్టి ఇంట్లోనే వున్నాడు. ఆఫీసు ఫైళ్లు వస్తే సంతకం చేసి పంపుతున్నాడుగాని భార్యతో మాట్లాడటంలేదు.

సంగతేమిటంటే రాణి చెప్పింది.

ఎం. ఏ. చదివిన అమ్మాయి ఎవర్నో ప్రేమించిందట. పెళ్లాడతానందట. అందుకామె అంగీకరించిందట. ఆయన ఒప్పుకోలేదట.

ఇంజనీరయిన కొడుక్కు పెళ్లి సంబంధాలు వస్తున్నాయట. బుద్ధిలో నా పోలికేనట! పెళ్లి నద్దంటున్నాడట. వాడి ఇష్టానికి వ్యతిరేకంగా చెప్పవద్దు అందట రాణి. ఏదో మంచి సంబంధం వుంటే అదే చేయాలని ఆయన పట్టుదల.

రాణీ, భర్తకూ మధ్య పిల్లల విషయంలో తగాదా ద్విగుణీకృతమై పెరిగిపోయిందట.

రోజూ సాయంకాలం నడవటం నాకు అలవాటు అయింది. అలాగే బయలుదేరాను. రాణి భర్త వెంట వచ్చాడు. తోవలో మాకు పిల్లలమీదే సంభాషణ.

రాణి చెప్పే విషయం నాకు అన్ని విధాలా నచ్చింది, ఆమె అభిప్రాయం గౌరవించటం శ్రేయస్కరమని చెప్పాను. రెండుగంటలకు తిరిగి వచ్చామింటికి.

రాత్రి అన్నం వడ్డిస్తున్న రాణిని చూస్తుంటే చిన్నతనంలో బ్రతిమాలి నాకు అన్నం తినిపించే అమ్మ గుర్తుకు వచ్చింది.

'మీరు ఇక్కడే వుండిపోకూడదు!' అంది పెరుగు వేస్తూ.

'నేనా?' అన్నాను నవ్వుతూ.

'అవును. మీకుమాత్రం ఎవరున్నారు. ఇక్కడే వుండండి మాకు తోడుగా వుంటారు' అంది.

'వద్దులే, నా యిల్లే నాకు సర్వస్వం. రేపు వెడతాను.' భోజనం పూర్తయింది.

ఆ రాత్రి నూత్న దంపతులవంటి భార్యా భర్తల గదిలోంచి వినిపించిన నవ్వులు నాకు జోల పాడినట్టున్నాయి. హాయిగా నిద్రపోయాను.

తెల్లవారింతర్వాత వెళుతుంటే గేటుదాకా వచ్చింది రాణి.

'వెళ్లొస్తాను' చెప్పాను.

'జాగ్రత్తగా వెళ్లిరండి' అంది.

'అంటే!'

'రెండుగటల్లో అంత పట్టుదలమనిషి మనస్సు మార్చారు గానీ, ఇన్నేళ్లలో మీమనసు మార్చుకోలేకపోయారు'

'అంటే!' అంటూ కోపంగా నవ్వుతూ చూస్తే, నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి. కళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరవకుండా సుతారంగా నవ్వింది రాణి.

* * * *

రాణికి నలభై అయిదేళ్లు. ఒకరోజు ఆమె దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

ఆయన చనిపోయాడు.

హడావుడిగా బయలుదేరి వెళ్లాను. వెళ్లేసరికే సంస్కారం పూర్తయింది.

రాణి మూర్తి దాల్చిన దైన్యంలాగా వుంది. ఆమెను ఓదార్చాలనుకొన్న నేను కంట తడిపెట్టుకొంటుంటే జాలిగా తుడిచి 'విచారించకండి' అని ఓదార్చింది.

అక్కణ్ణుంచి రెండు వారాలు అయినా రా బుద్ధి పుట్టలేదు నాకు.

ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకొంటున్న పిల్లలు ఆస్తి విషయాలు తేల్చుకొని వెళ్లిపోయారు. వాళ్ల ఆస్తుల పంపకం మాటల్లో ఒక్క మాటకూడా ఆమె మాట్లాడలేదు. నేను లేకపోతే ఆమెకు అన్యాయం జరిగివుండేదని నేను అనుకొంటే, ఆమె అలా అనుకోలేదు.

పిల్లలు వెళ్లిపోయాక లంకంత ఇంటిలో ఆమె ఒక్కతే పనివాళ్లతో ఎలా వేగుతుందో నాకు అర్థం కాలేదు.

నేను వెళ్లిపోతానన్నప్పుడు ఆమె వద్దనలేదు. బయలు దేరుతూ నేనే అన్నాను.

'ఇక్కడెందు కుండాలి నువ్వు! నా దగ్గరే వుందువుగాని. వెళదాం రాకూడదూ?'

'నేనా?'

'ఆఁ! నువ్వే! రారాదూ!' కోపంగా అడిగితే నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి. కళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరవకుండా సుతారంగా నవ్వింది రాణి.

* * * *

అయిదేళ్లు గడిచాయి. నాకు డెభ్భై ఏళ్లు. రాణి ఏభై. నాకు వంట్లో శక్తి సన్నగిలిపోతూవుంది. ఏమిటో ముసలితనం అంత శాపం లేదనిపిస్తుంది. ఎవరూ—నా అనేవాళ్లు ఎవరూలేని ఈ జీవితం నరకంకంటే అన్యాయంగా వుంది.

ఆనిశ్చిత జీవితానికి పర్యవసానం నేను దోషరహితంగా, నిర్మల జీవితం జీవించాననే తృప్తేకాని పొందింది ఏమీలేదు. నేను ఇలా కావటం ఎవరికోసం? నా కోసం కాదు! మరెవరి కోసం? నాకు తెలియదు!

రాణి ఉత్తరం వ్రాయించింది.

ఆమెకు ఆరోగ్యం బాగాలేదట, వెంటనే రమ్మని వుంది.

గుండెలు గుబగుబలాడాయి. ఇంత ముసలితనంలోనూ, నాకు ఎంతో శక్తి వచ్చింది. బయలుదేరాను.

నేను వెళ్లేసరికి ఆమె మంచంమీద వుంది. లేవలేదు. ఇల్లంతా హడావుడిగా వుంది. పిల్లలూ, పిల్లలపిల్లలూ అంతా వచ్చారు.

ఆ రోజంతా ఆమె ఏమీ మాట్లాడలేదు. మాట పడి పోయిందన్నారు కాని 'వచ్చారా? రారేమో—అనుకొన్నా.' అంతే. ఆ తర్వాత ఏమో చెప్పబోయింది. చెప్పలేక పోయింది. నీరసంగా తల కొట్టుకొంది. తల పట్టుకొని మంచంమీదే కూర్చున్నాను. కళ్లు మూసుకొంది.

గంటసేపు విలవిలలాడి కళ్లు తెరిచింది. నావైపు చూచింది. ఆమె కళ్లలోని చైతన్యాన్ని నా కళ్లు పీల్చుకొన్నాయేమో ఆమె కళ్లు నిర్జీవాలయ్యాయి.

ఇల్లంతా ఘొల్లుమంది.

తెల్లవారేసరికి బంధువులంతా వచ్చారు. ఇక వచ్చేవారు ఎవరూ లేరనుకొన్న తర్వాత శవసంస్కారానికి ఏర్పాట్లు మొదలయ్యాయి.

శవవాహకులకోసం చూస్తున్నారు. నేను మోస్తానంటే 'నువ్వు ఎందుకు ముసలివాడివి,' 'మీకెందుకు అసలే వార్ధక్యం' అన్నారు ఎందరో. నేను వినిపించుకోలేదు. నేను కూడా ఒకణ్ణి రాణిని స్మశానానికి మోసుకుపోతున్నాం.

నేను ఎత్తుకొన్న పిల్ల, నా కళ్లముందు పెరిగిన అమ్మాయి, నా అంత అయిన రాణి, నాకు నీతి చెప్పగల స్త్రీ నాకంటే ఎదిగిపోయిన రాణి, స్మశానానికి వెళుతూవుంది. నేను పుట్టినప్పుడు ఎక్కడున్నానో ఇంత వయస్సులో అక్కడే వున్నాను.

ఎక్కడనుంచో ఇక్కడ పడిన రాయిని నేను. నా కళ్ల ముందే పడిన గింజ ఆమె. ఆమె మొలకెత్తింది. నా ప్రక్కనే పెరిగి పెద్దదయింది. విశాలవృక్షం అయింది. నాకుకూడ

నీడనిచ్చింది. పూలు పూసింది పళ్లు కొచ్చింది. గింజల నిచ్చింది. గింజలు మళ్లీ మొక్కలూ వృక్షాలు అవుతున్నాయి. అయితే ఈ రాయి ఈలాగే వుండిపోయింది. ఎండకు వేడి ఎక్కుతూ వానకు చల్లబడుతూ చలనం లేకుండా ఎదుగుబొదుగు లేకుండా.

రాణి ఎండు కట్టెవంటి రాణిని, కట్టెలమీద పడుకో బెట్టారు. పెద్దకొడుకు కొరివి పెట్టాడు. కట్టెలు అంటుకొన్నాయి.

ఇక నాకేముంది? నా జీవితానికి అర్థం ఏముంది?! నాకేం మిగిలింది? ఏమిటిది అని విచారం కలిగింది. కళ్లవెంట నీళ్లు వచ్చాయి. నాకేం మిగిలింది అనుకొంటూ కోపంగా ఆమె ముఖంలోకి చూస్తే ఆమె నవ్వింది.

బుగ్గలు నొక్కులు పడ్డాయి. కనురెప్పలు కదిలాయి. కళ్లు గుండెల్లోకి చూశాయి. నోరు తెరవకుండా సుతారంగా నవ్వింది రాణి.

---

Prof. B. Rama Raju (Rtd)
H. No. 1-8 117/2. Chikkadpally,
HYDERABAD - 500 020.